క్లుప్తంగా

మారెమ్మకు ప్రత్యేక పూజలు


మారెమ్మవ్వ

ఆస్పరి: ఆస్పరిలోని మారెమ్మవ్వ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో అర్చకులు గోవిందు ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చన, హోమం, మంగళ హారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

14 నుంచి దస్తగిరి స్వామి ఉరుసు


ములుగుందంలో వెలసిన దస్తగిరి స్వామి దర్గా

ఆస్పరి: మండలంలోని ములుగుందం గ్రామంలో వెలసిన దస్తగిరి స్వామి 269వ ఉరుసు ఉత్సవాలు ఈనెల 14వ తేదీ నుంచి ఘనంగా నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు మంగళవారం తెలిపారు. ఈనెల 14న గంధం, 15న ఉరుసు, 16న జియారత్ కార్యక్రమంతో ఉత్సవాలు ముగుస్తాయని చెప్పారు.

అనర్హుల ఇంటి పట్టాలు రద్దు చేస్తాం


జగనన్న కాలనీలో పరిశీలిస్తున్న తహసీల్దార్ హుస్సేన్‌సాహెబ్

మద్దికెర: గతంలో ఇంటి స్థలాలు పొందిన వారిలో అనర్హులుంటే పట్టాను రద్దు చేసి అర్హులైన వారికి అందజేస్తామని తహసీల్దార్ హుస్సేన్‌సాహెబ్ స్పష్టం చేశారు. ఆయన మంగళవారం స్థానిక జగనన్న కాలనీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అనర్హులను గుర్తించడం జరుగుతోందన్నారు. పదెకరాల పొలం లేదా ఆదాయపు పన్ను చెల్లించే వారు ఇంటి పట్టాలు పొంది ఉంటే వాటిని రద్దు చేసి అర్హులైన నిరుపేదలకు అందజేస్తామన్నారు. తహసీల్దార్‌తో పాటు రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

లాలూస్వామి ఉరుసు ప్రారంభం


దర్గాలో పూజలు చేస్తున్న భక్తులు

కృష్ణగిరి: మండల పరిధిలోని చిట్యాల గ్రామంలో లాలూస్వామి ఉరుసు మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. ప్రారంభ రోజు గంధం కార్యక్రమం భక్తిశ్రద్ధలతో, మంగళ వాయిద్యాల నడుమ రాత్రి 11 గంటల నుంచి పురవీధుల గుండా అశ్వంపై కొనసాగింది. కబడ్డీ పోటీలు ప్రారంభమయ్యాయి. ఉరుసు సందర్భంగా పుట్టింటికి వచ్చిన ఆడపడుచులు, బంధువులతో గ్రామం కళకళలాడింది. ఉదయం నుంచే గ్రామస్తులు దర్గాలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 12న ఉరుసు, జానపద సంగీత విభావరి, 13న కిస్తీ కార్యక్రమాలు ఉంటాయని ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి


గడిగె బసవరాజు (ఫైల్)

హొళగుంద: మండల కేంద్రానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త గడిగె బసవరాజు (42) సోమవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. సదరు వ్యక్తి గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ బళ్లారి ఓపీడీలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతుడికి భార్య గడిగె పార్వతి, కుమారుడు ఉన్నారు. ఆలూరు ఎమ్మెల్యే బుసినె విరూపాక్షి సోదరుడు బుసినె శ్రీరాములు,నాయకులు, కార్యకర్తలు బసవరాజు భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. మంగళవారం ఆయన స్వగ్రామం హొళగుందలో అంత్యక్రియలు జరిగాయి.

ఎల్లార్తి దర్గాలను వక్ఫ్ బోర్డే నిర్వహించాలి

హొళగుంద: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఎల్లార్తి శేక్షావలి, షాషావలి దర్గాల నిర్వహణను టెండర్ ద్వారా ఇతరులకు అప్పగించకుండా వక్ఫ్ బోర్డు అధికారులే చూసుకోవాలని మంగళవారం గ్రామస్తులు, భక్తులు మాబాషా, రాముడు, కృష్ణ, డీలర్ ఈరన్న తదితరులు డిమాండ్ చేశారు. ఇప్పటికే విజయవాడలో ఈ నెల 18న దర్గాల నిర్వహణ విషయంపై టెండర్ నోటిఫికేషన్ విడుదల చేశారని అందుకు ఈ నెల 11 నుంచి 17వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవడానికి గడువు ఇచ్చారన్నారు. నెలకు రూ.20 లక్షలు పైగా చెల్లించేలా టెండర్ నిబంధనలు పెట్టారని, తద్వారా టెండర్ దక్కించుకున్న ప్రైవేటు వ్యక్తులు సేవల విషయంలో విపరీతంగా ధరలు పెంచి భక్తులను నిలువు దోపిడీ చేసే అవకాశాలున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.ఉన్నతాధికారులు స్పందించి దర్గాల నిర్వహణకు టెండర్ కాకుండా వక్ఫ్ బోర్డు పరిధిలో జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

భూమికి సారం.. కాపరికి భత్యం

- పొలాల్లో గొర్రెల మందలను నిలుపుతున్న వైనం
- వాటి విసర్జితాలతో భూసారం పెంపు
- పాత పద్ధతికే మొగ్గు చూపుతున్న రైతులు


పొలంలో గొర్రెల మందను నిలిపిన దృశ్యం

హాలహర్వి: వ్యవసాయ రంగం అధునాతన పద్ధతులతో కొత్త పుంతలు తొక్కుతున్నా.. కొన్ని విధానాలు మాత్రం కొనసాగుతున్నాయి. ఎరువుల భారం యేటా పెరిగిపోతుండడంతో వ్యవసాయం భారంగా మారింది. దీంతో రైతులు పెట్టుబడిని తగ్గించుకునేందుకు ప్రత్యామ్నాయంగా పాత పద్ధతులకు పెద్దపీట వేస్తున్నారు. గొర్రెల మందలను పొలాల్లో నిలబెట్టి వాటి మల విసర్జితాలను ఎరువుగా ఉపయోగించే పద్ధతులను మళ్లీ ముమ్మరం చేశారు. ఈ సంవత్సరం కూడా హాలహర్వి, ఆలూరు, హొళగుంద, ఆస్పరి, చిప్పగిరి, దేవనకొండ మండలాలకు.. అనంతపురం, కర్ణాటకకు చెందిన బెలగాం, బళ్లారి తదితర ప్రాంతాల నుంచి అనేక గొర్రెల మందలు చేరుకుని వేలాది ఎకరాల్లో మంద కట్టు జరుగుతోంది. ఇటీవల ఆయా ప్రాంతాల్లో గొర్రెల మందలు అత్యధికంగా కనిపిస్తున్నాయి. గొర్రెల మందలను ఎకరాకు రూ.వెయ్యి వరకు వెచ్చించి మూడు నుంచి వారం రోజుల పాటు చేలల్లో ఉంచి భూసారాన్ని పెంచుకునే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. కాపరులు గొర్రెలను ఆహారం దొరికే ప్రాంతాలకు తోలుకుని వెళ్తుంటారు. ముఖ్యంగా ఖరీఫ్ పూర్తయిన తర్వాత మందలతో వస్తుంటారు. ఖరీఫ్, రబీకి మధ్యకాలంలో పంట పొలాల్లో గొర్రెలను తిప్పడం ద్వారా గొర్రెలకు ఉదర పోషణ జరుగుతుంది. అదే సమయంలో గొర్రెలు విసర్జించే మల మూత్రాలు పొలాలకు ఎరువుగా ఉపయోగపడతాయి.

తరలింపులో ఇబ్బందులు..

గొర్రెల మందలను కిలో మీటర్ల కొద్దీ తరలించుకు రావడం వల్ల కాపరులకు వ్యయ ప్రయాసలు అధికమవుతున్నాయి. గంటల తరబడి రోడ్లపై నడిచే గొర్రెలను సంరక్షించుకునే సమయంలో వాటితో పాటు కాలినడక సాగించాల్సి ఉంటుంది. ఈ కారణంగా కాపరుల్లో ఆరోగ్య సమస్యలు తలెత్తినా గొర్రెల పోషణకు ఇబ్బందులుండవనే ఉద్దేశంతో సుదూర ప్రాంతాలకు తీసుకువస్తున్నారు. గొర్రెల మందలు గంటల తరబడి రోడ్లపైనే ప్రయాణించడం వల్ల తరచూ గాయపడతాయి.

పల్లె ప్రాంతాల్లో ఆదరణ ఉంది



గొర్రెల మందలకు పల్లె ప్రాంతాల్లో ఎల్లప్పుడూ ఆదరణ ఉంటుంది. కష్ట సాధ్యమైనా గిట్టుబాటు కాకపోయినా సుదూర ప్రాంతాల నుంచి తమ గొర్రెల మందలను మైదాన ప్రాంతాలకు పోషణ నిమిత్తం తీసుకొస్తాం. ఆయా ప్రాంతాల్లో రైతులు వాటిని పొలాల్లో నిలుపుకుంటారు.

– సురేష్, గొర్రెల కాపరి, తాడిపత్రి, అనంతపురం జిల్లా

పంట పొలాలకు ఎంతో మేలు



పంట పొలాల్లో గొర్రెలను నిలపడం ద్వారా ఎరువులు వేయకుండానే భూసారాన్ని పెంచుకోవచ్చు. సంప్రదాయ పద్ధతిలో భూసారం పెరుగుతుంది. మా పొలంలో గొర్రెల మందను ఉంచడం వల్ల కాపరులకు రోజుకు వెయ్యి, భత్యం ఇవ్వాల్సి ఉంటుంది. వాటి విసర్జన వల్ల పంట పొలాలు బాగా పండుతాయి. రసాయనాల వల్ల పంటలు సరిగా పండడం లేదు. గొర్రెల మందలను ఎకరాలో మూడు రోజులపాటు ఆపుతాము.

– గంగాధర, రైతు, హాలహర్వి

ప్రస్తుతం గొర్రెల మందలను పంట పొలాల్లో మంద కట్టేందుకు మునుపెన్నడూ లేనివిధంగా రైతులు ఆసక్తి చూపుతున్నారు.

నేటితో ముగియనున్న గడువు

హాలహర్వి: బీసీ, ఓసీ కార్పొరేషన్ల కింద రుణాల కోసం దరఖాస్తులు చేసుకునేందుకు బుధవారంతో గడువు ముగుస్తున్నట్లు ఎంపీడీఓ వరలక్ష్మి తెలిపారు. అర్హులైన నిరుద్యోగ అభ్యర్థులు త్వరగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రేపు కేదారేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ట

వెల్దుర్తి: నేషనల్ హైవే–44 ఆనుకుని ఉన్న స్థానిక జర్నలిస్టు కాలనీలోని లక్ష్మీ వేంకటేశ్వర, అయ్యప్ప స్వామి, సాయినాథ ఆలయ సమూహంలో కేదారేశ్వర స్వామి (అర్ధనారీశ్వరుడు) విగ్రహ ప్రతిష్ట ఈనెల 13న గురువారం జరుగనుంది. ఈ సందర్భంగా మంగళవారం నుంచి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. 13న ఉదయం 9 నుంచి 11గంటల వరకు విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఉంటుందని ఆలయ కమిటీ ప్రతినిధి యార్లపాటి శ్రీధర్ శర్మ తెలిపారు. భక్తులు పాల్గొనాలని కోరారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

తుగ్గలి: విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు అవసరమని హెచ్‌ఎం నరేంద్ర, వార్డెన్ సుంకన్న అన్నారు. మంగళవారం ఎస్సీ హాస్టల్‌లో చదువుతున్న విద్యార్థులకు క్రీడా పరికరాలను పంపిణీ చేశారు. విద్యార్థులకు అందించిన చెస్ బోర్డు, క్యారంబోర్డు, జావెలిన్‌త్రో, డిస్కస్‌త్రో, వాలీబాల్ పరికరాలను ఉపయోగించుకుని క్రీడల్లో రాణించాలని సూచించారు.ఫిజికల్ డైరెక్టర్ పాండురంగ రాజు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

యూనిక్ కోడ్‌తో రైతుకు నేరుగా పథకాలు

మద్దికెర: ప్రతి రైతుకు 11 అంకెలతో కూడిన యూనిక్ కోడ్ కేటాయించి నేరుగా సంక్షేమ పథకాలు అందించేలా కేంద్రం చర్యలు చేపట్టిందని ఏఓ రవి అన్నారు. మంగళవారం రైతు సేవా కేంద్రం–2లో యూనిక్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా డిజిటలైజేషన్ చేయాలన్న సంకల్పంతో కేంద్రం ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు. కోడ్ వల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పీఎం కిసాన్, వ్యవసాయ పరికరాలు, సబ్సిడీ పథకాల నగదు నేరుగా రైతు ఖాతాలో జమ అవుతుందన్నారు. వీఏఏ జాకీర్‌హుస్సేన్ పాల్గొన్నారు.

- పత్తికొండ రూరల్: మండలంలోని పులికొండ, దూదేకొండ, పందికోన, దేవనబండ, జూటూరు గ్రామాల పరిధిలో రైతు సేవా కేంద్రాల్లో జరుగుతున్న యూనిక్ కోడ్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఏఓ వెంకట్రాముడు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. మండలంలోని అన్ని రెవెన్యూ గ్రామాల పరిధిలో 15,195 మంది రైతులు ఉన్నట్లు గుర్తించామన్నారు. అర్హులందరూ రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఏఈఓ శ్రీనాథ్, రైతు సేవా సిబ్బంది పాల్గొన్నారు.


రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఏఓ

- వెల్దుర్తి: మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాలలో.. వ్యవసాయ భూమి గల ప్రతి రైతుకు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు ప్రారంభమైనట్లు ఏఓ అక్బర్‌బాషా తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్‌ఎస్‌కేలో జరుగుతున్న నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు.
- హాలహర్వి: వ్యవసాయ రంగాన్ని పూర్తిగా ఆధునికీకరణ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం రైతులకు ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్యను కేటాయిస్తున్నట్లు ఏఓ శివశంకర్ తెలిపారు. రైతులందరూ పట్టాదారు పాసు పుస్తకం జిరాక్స్ లేదా వన్‌బీ, ఆధార్ జిరాక్స్, ఫోన్ నంబర్‌తో రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ట పూజలు

ఆలూరు: నియోజకవర్గ కేంద్రంలోని బళ్లారి – కర్నూల్ రోడ్డు సమీపంలో శ్రీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో అశ్వర్థనారాయణ, నాగ దేవతమూర్తుల నూతన విగ్రహాల ప్రాణప్రతిష్టాపన ప్రత్యేక పూజా కార్యక్రమాలను పండితులు గరుడాద్రి రామ సుబ్బయ్యశాస్త్రీ ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభించారు. మంగళవారం ఉదయం గణపతి పూజ, గోపూజ సంకల్పం, పుణ్యహవచనాలు, కంకణ ధారణ తదితర కార్యక్రమాలను నిర్వహించారు.అలాగే దేవతా మూర్తులకు ప్రత్యేక పూజలు, కలశ స్థాపన, నవగ్రహ వాస్తు పూజలు, అగ్ని ప్రతిష్ట, గణపతి హోమం, సాయంత్రం నాగదేవతా మూర్తులకు జలాభిషేకం, సర్పసూక్తము, పారాయణ, దీక్ష హోమం, లక్ష్మిహరణ పూజలు చేశారు. 12న ఉదయం నాగదేవతలకు క్షీరాభిషేకం, పంచ ముత్తఅభిషేకం, రుద్రహోమం, దుర్గాహోమం, శయ్యాధివాసం , 13న తెల్లవారుజామున నాగదేవతల యంత్ర స్థాపన, విగ్రహ ప్రతిష్టాపన, కల్యాణం, బలిహారం, అశ్వర్థనారాయణ కల్యాణం, 12 :30 గంటలకు వివిధ రకాల పుష్ప, ఫల, పంచామృతాభిషేకం, పూర్ణహుతితో పూజా కార్యక్రమాలు ముగుస్తాయన్నారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలన్నింటినీ ఆలూరు నియోజకవర్గ ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష కార్యదర్శులు వై.జనార్ధన్‌శెట్టి, భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు.


ఆలూరులోని వాసవీకన్యాకా పరమేశ్వరి దేవి ఆలయంలో ప్రతిష్టాపనకు సిద్ధంగా ఉన్న దేవతామూర్తులు

విద్యార్థులకు కంటి పరీక్షలు

కృష్ణగిరి: మండల పరిధిలోని అమకతాడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు మంగళవారం ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. వెల్దుర్తి సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో కర్నూలు మోడరన్ ఐ హాస్పిటల్ వైద్య బృందం వారిచే నిర్వహించిన ఈ కార్యక్రమంలో 201 మంది విద్యార్థులకు పరీక్షలు చేసినట్లు హెచ్‌ఎం రమణ తెలిపారు. భజన మండలి ప్రతినిధులు సాయి కృష్ణారెడ్డి, సాయిప్రసాద్, ఒంగోలు సాయి, సురేశ్ యాదవ్, హుసేన్, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమ నిర్వహణకు సహకరించిన గ్రామ పెద్ద వీరభద్రుడు తదితరులకు భజన మండలి ప్రతినిధులు కృతజ్ఞతలు తెలుపుతూ.. కంటి సమస్యలు ఉన్నవారికి ఉచితంగా అద్దాలు అందజేయనున్నట్లు వెల్లడించారు.

డంపింగ్ యార్డును తరలించండి

మద్దికెర: మండల కేంద్రంలో నీటి ట్యాంకుల వద్ద ఉన్న శ్మశానంలోని డంపింగ్ యార్డును ఇతర ప్రాంతానికి తరలించాలని శ్రీవిద్యాసాయి కళాశాల కరస్పాండెంట్ మాధవ్, ప్రిన్సిపాల్ సునీత మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ హుస్సేన్ సాహెబ్ కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. డంపింగ్ యార్డులో చెత్తకు నిప్పు పెట్టడంతో నిత్యం పొగలు వస్తున్నాయని విద్యార్థులు, చుట్టుపక్కల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి డంపింగ్ యార్డును గ్రామానికి దూరంగా తరలించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ భూమిని సేకరించి యార్డును తరలించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈఓ శివకుమార్, బండారి ఆంజనేయులు ఉన్నారు.

నేడు వీఆర్వోల సమావేశం

ఆలూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం వివిధ గ్రామాలకు చెందిన వీఆర్వోలతో సమావేశం నిర్వహించనున్నట్లు ఆర్‌ఐ బసన్నగౌడు మంగళవారం తెలిపారు. మండలంలో రైతులకు సంబంధించిన భూముల మ్యుటేషన్, పట్టాదారు పాసుపుస్తకాల మంజూరు, సర్వే తదితర అంశాలపై చర్చించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి వీఆర్వోలందరూ హాజరు కావాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు


గాయపడిన రమేష్

ఆలూరు: చిప్పగిరి సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద మంగళవారం రాత్రి 8:50 గంటల సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఘటనపై స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. చిప్పగిరి మండలంలోని బెల్డోణ గ్రామానికి చెందిన రమేష్ (31) సొంత పని నిమిత్తం బైక్‌పై గుంతకల్లు పట్టణానికి వెళ్లారు. పని ముగించుకుని సొంత గ్రామానికి వస్తుండగా చిప్పగిరి సమీపంలోని పెట్రోల్ బంక్ వద్దకు అకస్మాత్తుగా గొర్రెలు అడ్డంగా రావడంతో బైక్ అదుపుతప్పి కింద పడిపోయాడు. తీవ్ర రక్తగాయాలకు గురై స్పృహ తప్పి పడిఉన్న రమేష్‌ను చూసిన వాహనదారులు వెంటనే 108కు సమాచారాన్ని చేరవేశారు. అంబులెన్స్ సిబ్బంది అతన్ని గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. ఘటనపై పోలీసులు రమేష్ బంధువులకు సమాచారం అందించి ప్రమాదంపై విచారణ చేపట్టారు.

కూలీలు చేయాల్సిన పనులకు యంత్రాలు

వెల్దుర్తి: మండలంలో పలు చోట్ల ఉపాధి కూలీలతో చేయించాల్సిన పనులను యంత్రాలతో చేయిస్తూ వారి కడుపు కొడుతున్నారని సీపీఐ మండల కార్యదర్శి టి.కృష్ణ ఆరోపించారు. సోమవారం రాత్రి బింగిదొడ్డి, మంగంపల్లె గ్రామాల మధ్య జేసీబీ యంత్రంతో పనులు చేస్తుండడంతో ఆయన, పార్టీ సభ్యులతో కలిసి వెళ్లి అడ్డుకున్నారు. ఈ సందర్భంగా టి.కృష్ణ మాట్లాడు.. ప్రస్తుతం యంత్రం పనిచేస్తున్న ప్రాంతంలో కూలీలతో ఉపాధి పనులు చేయించాల్సి ఉందన్నారు. అవినీతిపరులు కూలీల కడుపు కొట్టి, అక్రమ సంపాదన కోసం యంత్రాలతో పనిచేయిస్తున్నట్లు ఆరోపించారు. మీకు సగం.. మాకు సగం అన్న రీతిలో సంబంధిత శాఖ అధికారుల నుంచి సిబ్బంది వరకు అవినీతి పరులతో చేతులు కలిపి దోచుకుంటున్నట్లు అర్థమవుతోందన్నారు. ఎందరో కూలీలు పనులు లేక వలసలు వెళ్తుంటే కొందరు అధికారులు అవినీతి పరులకు కొమ్ము కాస్తూ యంత్రాలతో పనిచేయిస్తున్నారని విమర్శించారు. సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకుని కూలీలకు ఉపాధి పనులు కల్పించాలన్నారు. సీపీఐ నాయకులు రాజు, చిన్న మాదులు ఉన్నారు.

మామిడి రైతులకు శిక్షణ


మామిడి పూతను పరిశీలిస్తున్న అధికారులు, శాస్త్రవేత్తలు

వెల్దుర్తి/ఓర్వకల్లు: వెల్దుర్తి మండలం సిద్దినగట్టు, ఓర్వకల్లు మండలం ఉయ్యాలవాడ గ్రామాల పరిధిలోని మామిడి రైతులకు ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని మామిడి తోటలను పరిశీలించారు. అనంతరం జిల్లా ఉద్యానశాఖాధికారి రామాంజనేయులు ఆధ్వర్యంలో ఉద్యాన సమగ్ర అభివృద్ధి మిషన్‌లో భాగంగా జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మహానంది ఉద్యాన పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త ఠాగూర్‌నాయక్ రైతులకు పలు సూచనలు చేశారు. పూత సమయంలో అనవసరంగా మందుల పిచికారీ చేస్తే పూత రాలిపోయే ప్రమాదం ఉంటుందన్నారు. పిందె కట్టిన తరువాత పిచికారీ చేయవలసిన మందుల గురించి వివరించారు. మామిడి తోటలకు చుట్టపక్కల బొప్పాయి, జామ, సీతాఫలం తదితర పండ్ల తోటలుంటే మామిడి పంటకు ఆశించే పండు ఈగ నివారణకు లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. జిల్లా ఉద్యానశాఖాధికారి మాట్లాడుతూ.. రైతులు ప్రభుత్వం అందించే ఉద్యాన శాఖ పథకాలు ఉపయోగించుకుంటూ, అధికారులు, శాస్త్రవేత్తలు అందించే సలహాలు, సూచనలు పాటిస్తూ దిగుబడులు పెంచుకోవాలన్నారు. ఓర్వకల్లు, కర్నూలు ఉద్యానశాఖాధికారులు, గ్రామాల సిబ్బంది అనూష, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఉరవకొండ గని మఠం పీఠాధిపతి రాజేంద్ర మహాస్వామి

అశాంతికి కారణం అజ్ఞానమే

పత్తికొండ రూరల్: అశాంతికి కారణం అజ్ఞానమే అని, ఆత్మ జ్ఞానమే మోక్షానికి కారణమని ఉరవకొండ గని మఠం పీఠాధిపతులు కరిబసవ రాజేంద్ర మహాస్వామి అన్నారు. మంగళవారం పత్తికొండ మండల పరిధిలోని పెద్దహుల్తి గ్రామంలో వెలసిన రాజయోగానంద గీతామందిరం ద్వాదశ వార్షికోత్సవం సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పీఠాధిపతులు, మఠాధిపతులచే వేదాంత మహాసభలు నిర్వహించారు. ముందుగా గోమాతకు పూజలు నిర్వహించి స్వామీజీలతో గ్రామంలో ఊరేగింపు చేశారు. అనంతరం జరిగిన వేదాంత మహాసభ కార్యక్రమాన్ని ఉద్దేశించి స్వామీజీలు మాట్లాడుతూ.. ప్రస్తుతం సమాజానికి ఎదురవుతున్న అనేక సవాళ్లను అధిగమించాలంటే సనాతన ధర్మ వ్యాప్తియే మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో లత్తవరం ఉమామహేశ్వర పీఠాధిపతి ప్రణవానందగిరి స్వామి, శంకరానందగిరి స్వామి సేవాశ్రమం, కొక్కెరచేడు – గురుచరణానందగిరి మాతాజీ, కాశినాయన అన్నదాన ఆశ్రమం –నిత్యానంద భారతి స్వామి, చాగలమర్రి వేదాంత ఫౌండేషన్ శివరామానంద ఆశ్రమం – అభినవ శంకరానందగిరి స్వామి, రాయదుర్గం రాజవిద్యానందాశ్రమం పీఠాధిపతి, టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పథకాలకు చంద్రబాబు తిలోదకాలు

తుగ్గలి: మాయమాటలు చెప్పి గద్దెనెక్కిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీలన్నీ తుంగలో తొక్కి, ప్రకటించిన పథకాలకు తిలోదకాలిచ్చారని వైఎస్సార్ సీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు శ్రీనివాసరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు జిట్టా నాగేష్‌యాదవ్, మండలాధ్యక్షుడు అట్ల గోపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు పులికొండనాయక్, మాజీ సభ్యుడు నారాయణనాయక్ తదితరులు మంగళవారం స్థానికంగా మాట్లాడారు. ఎన్నికల ముందు నోటికొచ్చిన హామీలిచ్చి అధికారం చేపట్టాక సూపర్‌సిక్స్ చూసి భయమేస్తోందని అంటున్న ముఖ్యమంత్రి పథకాలకు తిలోదకాలిచ్చారని మండిపడ్డారు. ప్రజలను మోసం చేయడం బాబుకు కొత్తేమీ కాదన్నారు. సంపద ఎప్పటిలోగా సృష్టిస్తారో, పథకాలు ఎప్పటిలోగా అందిస్తారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. కరోనా సమయంలోనూ తమ నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు సంక్షేమ పథకాలు అందించారని గుర్తు చేశారు. అబద్ధపు హామీలతో కూటమి నాయకులు అధికారం చేపట్టి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారన్నారు. కూటమి ప్రభుత్వంపై 8 నెలలకే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందన్నారు. కూటమి నాయకులకు బుద్ధి చెప్పేలా మోసాలను ప్రజల్లోకి తీసుకెళతామని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ ఐటీ వింగ్, ఎస్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు చంద్రశేఖరరెడ్డి, బీమానాయక్, నాయకులు, ఉప్పర్లపల్లి ఉప సర్పంచ్ రామాంజి, ఈశ్వరరెడ్డి, కృష్ణానాయక్, రత్నానాయక్, సురేష్ పాల్గొన్నారు.

నేడు చెన్నకేశవస్వామి రథోత్సవం


పూజలందుకున్న కౌలుట్ల చెన్నకేశవస్వామి

దేవనకొండ: మండలంలోని కప్పట్రాళ్ల రిజర్వ్ ఫారెస్టులో వెలసిన కౌలుట్ల చెన్నకేశవస్వామి వారి రథోత్సవ కార్యక్రమం బుధవారం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు మంగళవారం తెలిపారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, విష్ణు సహస్రనామం, విశేషాలంకరణ, గజవాహన ఉత్సవం, సాయంత్రం నుంచి శ్రీవారి రథోత్సవం చేపడతామన్నారు. తర్వాత ఊంజలసేవ, తిరునామ సంకీర్తనలు, వేద స్వస్తి, తీర్థ ప్రసాద వితరణ జరుగుతుందన్నారు. రథోత్సవాన్ని తిలకించేందుకు జిల్లాలోని నలుమూలల నుంచేగాక తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొననున్నారు.

బాపురంలో బసవేశ్వరస్వామి రథోత్సవం

హాలహర్వి: మండలంలోని బాపురం గ్రామంలో బుధవారం బసవేశ్వరస్వామి రథోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు గ్రామపెద్దలు మంగళవారం తెలిపారు. మంగళవారం ఉదయం 6 గంటలకు గంగపూజ, కుంభాభిషేకం, పంచామృతాభిషేకం, శ్రీవారి పాదపూజ, ప్రసాద వినిమయం, గణారాధన కార్యక్రమాలు జరిగాయి. బుధవారం ఉదయం 3 గంటలకు మహారుద్రాభిషేకం, 5 గంటలకు బసవేశ్వరస్వామి ఉచ్చాయోత్సవం ఉంటుందన్నారు. సాయంత్రం 5 గంటలకు రథోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు.


పూజలందుకుంటున్న బసవేశ్వరస్వామి


తుగ్గలిలో రోడ్డు పక్కన వదిలేసిన గుంతలు



తవ్వారు.. వదిలేశారు!

- రోడ్డు పక్కన ప్రమాదకరంగా గుంతలు
- కేబుల్ నెట్‌వర్క్ కోసం తవ్వి.. పూడ్చని వైనం

తుగ్గలి : అది ఆదోని–గుత్తి ప్రధాన రహదారి.. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గం గుండా కర్ణాటక భక్తులు అధికంగా మంత్రాలయం పుణ్యక్షేత్రానికి వెళ్తుంటారు. అలాంటి ప్రధాన రహదారికి ఇరువైపులా చేపట్టిన కేబుల్ నెట్ వర్క్ పనులతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు పక్కనే కేబుల్ లైన్ వేసేందుకు పెద్దపెద్ద గుంతలు తవ్వి మట్టిని రోడ్డుపై పోశారు. నెలలు గడుస్తున్నా.. తవ్విన గుంతలు పూడ్చకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ డీఈ శివరుద్రకుమార్‌ను సంప్రదించగా..ఓ వైపు నుంచి గుంతలు పూడ్చుకుంటూ వస్తున్నారు. గుంతలు పూడ్చాలని ఇప్పటికే కేబుల్ కాంట్రాక్టర్‌ను ఆదేశించామని చెప్పారు.


గిరిగెట్ల–జొన్నగిరి మధ్య మదనంతపురం స్టేజీ సమీపంలో వదిలేసిన గుంత